ఘనంగా అన్నమయ్య జయంతి

నల్లకుంట: నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో సోమవారం సాయంత్రం తాళ్ల పాక అన్నమాచార్య జయంతిని నిర్వహించారు. దీనికి హాజరైన హైకోర్టు న్యాయవాది వీవీ ఎల్ఎన్ శర్మ, సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాసశర్మతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భక్తి కవిత్వాన్ని, సమాజాభ్యుదయాన్ని సమన్వయ పరిచిన సంకీర్తనాచార్యుడు అన్నమయ్య అని కొనియాడారు. సంగీత విద్వాంసురాలు మల్లాది యశస్విని బృందంచే నిర్వహించిన స్వరార్చన కచేరి ఆకట్టుకుంది.

వ్యక్తి అదృశ్యం


గడ్డం సందీప్ (ఫైల్)

నల్లకుంట: ఇంటర్వ్యూకు అని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్సై జె.శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... ప్రైవేటు ఉద్యోగి గడ్డం సందీప్(41) కుటుంబ సభ్యులతో కలిసి నల్లకుంట పద్మాకాలనీలో నివాసముంటున్నాడు. ఈనెల 9న ఉదయం 10గంటల సమయంలో హెచ్‌సీఎల్‌లో ఇంటర్వ్యూ ఉందని భార్య పీఎస్ శోభనతో చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం భార్య ఫోన్ చేయగా మాట్లాడిన సందీప్ సాయంత్రం 4గంటలకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అనుమానంతో శోభన విచారించగా ఆ రోజు భర్తకు హెచ్‌సీఎల్‌లో ఎలాంటి ఇంటర్వ్యూ లేదని తెలిసింది. శోభన అన్ని చోట్ల వెతికినా భర్త ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన ఆమె తన భర్త కనిపించడం లేదంటూ శనివారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీజీడీఏ) నాయకులు, విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణి, ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.బాల కృష్టారెడ్డిలకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. అన్ని వర్సిటీలకు కలిపి కేవలం 400 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసిందని టీజీడీఏ నాయకులు చెప్పారు. వర్సిటీలలో 13 ఏండ్లుగా అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయనందున సుమారు 3000 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. తక్కువ సంఖ్యలో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి విడుదల చేసిన జీవో నంబర్ 21ని జారీ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో టీజీడీఏ నాయకులు రమణ రావు, పెద్దిరెడ్డి నరేందర్ రెడ్డి, బొల్లం తిరుపతి, రామ్ నరసింహా గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజాస్వామ్యంలో హింసాకు తావులేదని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర నాయకులు డాక్టర్.మాసాడి బాబురావు అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినర్ హాలులో ఏబీవీపీ ఆధ్వర్యంలో మానవత్వమా...? మావోయిస్టు మరణకాండనా...? అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ వర్సిటీలకు ఏబీవీపీ నాయకులు హాజరుకాగా ఓయూ అధ్యక్షులు దృహన్ అధ్యక్షత వహించారు. డా.మాసాడి బాబురావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయుధాలు చేపట్టి చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని అమాయకులను చంపుతున్న నక్సలైట్ల ఏరివేతకు కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం శోచనీయమన్నారు. ఆపరేషన్ కగార్ వ్యతిరేకులను ఘటుగా విమర్శించారు. కార్యక్రమంలో డా.రామకృష్ణ, జీవన్, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డి పాల్గొన్నారు.

మైక్రో బయోలజీ విభాగం సిల్వర్ జూబ్లీ పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలోని మైక్రో బయోలజీ విభాగాన్ని స్థాపించి 50 సంవత్సరాలు సందర్భంగా అక్టోబరులో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించనున్నారు. సోమవారం వీసీ ప్రొ.కుమార్ అధికారులు, ఇతర అధ్యాపకులు ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎమర్జింగ్ మైక్రోబియల్ టెక్నాలజీస్ ఫర్ వన్ హెల్త్ అనే అంశం పై అక్టోబరు 15,16,17 తేదీలలో ఓయూలో అంతర్జాతీ సదస్సును నిర్వహించనున్నట్లు విభాగం హెడ్, సదస్సు కన్వీనర్ ప్రొ. భీమా తెలిపారు. సదస్సుకు 20 దేశాల నుంచి వక్తలు, ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు ఓయూలో రౌండ్‌టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు శాంతి చర్చలు-మేథో స్పందన అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. మధ్య భారత్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వం విప్లవకారులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని ఓయూ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగనుంది.

ఆకతాయిల ఆగడాలు!

- అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో రెచ్చిపోతున్న పోకిరీలు
- విఫలమవుతున్న గస్తీ పోలీసులు
- సున్నిత ప్రాంతాల్లో సైతం నిఘా నిల్
- చర్యలు తీసుకుంటామంటున్న ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్



అంబర్‌పేట: పోకిరీలు రెచ్చి పోతున్నారు. గల్లీల్లో ఆకాతాయిలు ఆగడాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఆకతాయిల వేధింపులతో స్థానికంగా నిత్యం శాంతి భద్రతల సమస్యలు తలెత్తున్నాయి. పట్టించుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో ప్రధానంగా గోల్నాక కమాలనగర్, గంగానగర్, శంకర్‌నగర్, అంబర్‌పేట ప్రేమ్‌నగర్, నరేందర్‌నగర్, మల్లికార్జున్‌నగర్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం, చీకటి వేళల్లో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. దీంతో స్థానికంగా చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైన పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బస్తీ, కాలనీల్లో గస్తీ పెంచాలి...

◆ పోలీసు స్టేషన్ పరిధిలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే బ్లూకోట్స్ సిబ్బంది ఆకతాయిల పట్ల పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది అసాంఘిక శక్తులను నియంత్రించడంలో విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో చీకటి పడగానే మద్యం, గంజాయి సేవిస్తున్నారు. అంతే కాకుండా దారిన పోయేవారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. బెదిరింపులకు పాల్పడూ భయాందోళనకు గురిచేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

స్టేషన్‌కు వచ్చే 10 ఫిర్యాదుల్లో 3 అవే...

◆ ఇటీవల జిందా తిలిస్మాత్ చౌరస్తాలో ముగ్గురు యువకులపై దాడి చేసి వారి డబ్బులను ముగ్గురు యువకులు ఎత్తుకెళ్లిన సంఘటన జరిగింది. కొన్ని పాన్‌డబ్బాలు, సిగరెట్లు విక్రయించే కిరాణ దుకాణాల సమీపం నుంచి సామాన్యులు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. అంబర్‌పేట పోలీసు స్టేషన్‌కు నిత్యం వచ్చే 10 కేసుల్లో రెండు, మూడు ఆకతాయిల వల్ల జరిగే పంచాయితీలు ఉండటం గమనార్హం.

చర్యలు తీసుకుంటా

పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గస్తీ పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకుంటాను. సున్నిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తాను. తమ క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును సమీక్షిస్తాను. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదే. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా 100 డయల్ చేస్తే తక్షణమే స్పందిస్తాం. నేరుగా తన దృష్టికి తీసుకువస్తే తక్షణ చర్యలు తీసుకుంటాను.

– కిరణ్‌కుమార్ అంబర్‌పేట ఎస్‌హెచ్ఓ

మురళీనాయక్ అమర్ రహే..

నల్లకుంట: భారత సరిహద్దులో పాకిస్తాన్ సైనికుల అనైతిక దాడిలో తెలుగు యువకుడు మురళీనాయక్ వీర మరణం పొందారని పర్యావరణవేత్త డాక్టర్ జయసూర్య, ఎన్‌సీఏ అధ్యక్షుడు వి.మోహన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రు నివాళి అర్పించారు. వీర్ జవాన్ మురళీనాయక్ అమర్ రహే.. అనే నినాదాలు చేశారు. అనంతరం సామాజిక సేవకుడు రాజీవ్ మాట్లాడుతూ... పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడికి ప్రతీకారంగా భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఉగ్రమూకలను చావుదెబ్బ కొట్టిన భారత ఆర్మీ తమ సత్తా చాటిందన్నారు. నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మోహన్ నాయుడు, శ్రీనివాసరావు, వీరయ్య, రమణ, కిరణ్, ప్రశాంత్, నరసింహమూర్తి, రమేష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌సీఏ ప్రతినిధులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి


జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, పార్కులు, నాలా పెండింగ్ పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. అలాగే గుర్తించిన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈ ప్రశాంతి, ఏఈలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న గౌరీభట్ల లక్ష్మణామూర్తి, నందిని తదితరులు

నల్లకుంట: శ్రీసాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాంగణంలో తాళ్లపాక అన్నమయ్య జయంతిని నిర్వహించారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన అన్నమాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు నందిని, మ్యూజిక్ థెరపిస్టు యామినిల పర్యవేక్షణలో అకాడమీ విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరి విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ గౌరీభట్ల వసుధా మూర్తి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి

చిక్కడపల్లి: ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) తన అనుబంధ సంస్థలన్నింటిని ఆదేశించిందని బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవీ రాధాకృష్ణ వివరించారు. సోమవారం సాయంత్రం జవహర్‌నగర్‌లోని శ్రమశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడి అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భారత సైనికులు ఆపరేషన్ సిందూర్‌తో పాటు పాకిస్తాన్ కవ్వింపు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. ఈ సమావేశంలో జాతీయ, రాష్ట్రనేతలు హిరేన్ పాండ్యా, మల్లేశం, రామ్మోహన్, శంకర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ



చిక్కడపల్లి: సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి అన్నారు. సోమవారం గాంధీనగర్‌లో డివిజన్‌లోని ఆయా ప్రాంతాలలో వికలాంగులు, వృద్ధులకు ఆమె ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా రోడ్లపై నివసించే ఆహారంతో పాటు తాగునీటిని అందించాలన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.

వరల్డ్ మాస్టర్స్ గేమ్స్ నగర క్రీడాకారుల ఎంపిక

ఉస్మానియా యూనివర్సిటీ: తైవాన్‌లో జరిగే వరల్డ్ మాస్టర్స్ గేమ్స్–2025కు నగరానికి చెందిన అథ్లెటిక్స్ కోచింగ్ అకాడమి క్రీడాకారులు అవిక్ నియోగీ, సుభామిత్ర చటర్జీ ఇండియా తరపున ఎంపికైన్నట్లు ఓయూ ఫీజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 30 వరకు తైవాన్‌లోని తైపీ అండ్ న్యూ తైపీ సిటీలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. అవినిక్ నియోగీ, సుభామిత్ర చటర్జీ 2023లో జరిగిన నేషనల మాస్టర్స్ గేమ్స్‌లో వివిధ విభాగాలలో బంగారు పతకాలు సాదించిన్నట్లు చెప్పారు.

కష్టపడి చదివే వారికి మంచి భవిష్యత్


జూనియర్ సివిల్ జడ్జీగా ఎంపికైనా పి.నరేష్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కష్టపడి చదివే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని... తమ కళాశాల విద్యార్థి పి.నరేష్ జూనియర్ సివిల్ జడ్జీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ జి. సరోజవివేక్ అన్నారు. 47వ ర్యాంక్ సాధించి జూనియర్ సివిల్ జడ్జీగా ఎంపికైన పి.నరేష్‌ను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా డా. సరోజ వివేక్ మాట్లాడుతూ... ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యతగా మెలుగుతూ విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. అనంతరం పి.నరేష్ మాట్లాడుతూ... లా కళాశాల అధ్యపకుల ప్రోత్సాహంతో మంచి ర్యాంకును సాధించానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొ. లింబాద్రి, జాయింట్ సెక్రటరీ రమణకుమార్, కళాశాల డైరెక్టర్ వై.విష్ణుప్రియ, లా కళాశాల ప్రిన్సిపాల్ సృజన తదితరులు పాల్గొన్నారు.

జితేంద్రరావుకు పురస్కారం


సీజేఎస్ ఇండియా ఎండీ జితేంద్రరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

చిక్కడపల్లి: సాఫ్ట్‌వేర్ కంపెనీ సీజేఎస్ ఇండియా ఎండీ జితేంద్రరావు జట్టుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంస పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం జితేంద్రరావు చిక్కడపల్లిలో సోమవారం మాట్లాడుతూ.. సీఎస్ఆర్ కార్యకలాపాలు, సామాజిక సేవ చేస్తున్నందుకు పురస్కారం లభించిందన్నారు. ఇటీవల రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు.

ఘనంగా నాయిని నర్సింహారెడ్డి జయంతి వేడుకలు


గాంధీనగర్‌లో నాయినికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, వి.శ్రీనివాస్‌రెడ్డి, ముఠాజైసింహ


అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ వీఎస్ఆర్

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ తొలి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. నాయిని నర్సింహారెడ్డి జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా ముషీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా నాయిని నర్సింహారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి ఇందిరా పార్కు చౌరస్తాలో అన్నదానం చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం


అంబర్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎన్.బలరామ్

అంబర్‌పేట: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో అంబర్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన నోబుల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను సోమవారం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) చైర్మన్ అండ్ ఎండీ ఎన్.బాలరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చదువుతో పాటు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయని అన్నారు. యువతకు స్కిల్స్ ఎంతో ముఖ్యమని, స్వయం ఉపాధికి ఇది ఒక గొప్ప అవకాశమని ఆయన పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌కు సిమ్సన్ ఫార్మా లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.సత్యనారాయణరావు సుమారు రూ.3లక్షల విలువైన కంప్యూటర్ ల్యాబ్‌ను విరాళంగా అందించారు. ఈ ల్యాబ్‌ను డేటా ఎంట్రీ కోర్సు ట్రైనింగ్ కోసం ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు సురేష్‌కుమార్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

శారదాంబకు లక్ష పుష్పార్చన



నల్లకుంట: పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం నల్లకుంట శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు నిర్వహించి, చంద్రమౌళేశ్వర స్వామికి విశేష పూజలు కావించారు. అలాగే శారదా మాతను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి లక్ష పుష్పార్చన చేశారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ మఠం ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ ధాన్యాలు, అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలు, కొబ్బరి కాయలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. అనంతరం చండీపూజ చేసి భక్తులకు తీర్థప్రసాద వితరణ కావించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి


ఎస్సార్టీ క్వార్టర్స్‌లో మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ వాటర్‌వార్క్స్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్‌లో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ పావనికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆమె వాటర్‌వర్క్స్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు. కార్పొరేటర్ సూచన మేరకు వినయ్‌కుమార్ సోమవారం మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్, నేతలు ఉమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎనలేనివి

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నల్లకుంట: నల్లకుంటలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ నర్సింగ్ యూనిట్స్ ఆధ్వర్యంలో సోమవారం డీడీహెచ్‌ఆర్‌సీ ఆడిటోరియంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉస్మానియా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సునీత, డీడీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ జీఎల్‌కే దుర్గ, డీడీఎంఎస్ నర్సింగ్ యూనిట్స్ అధ్యక్షురాలు ఉషాకంద అక్కడ ఏర్పాటు చేసిన నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 50 ఏళ్లుగా డీడీఎంఎస్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్, స్కూల్ ఆఫ్ నర్సింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. నర్సింగ్ కళాశాలలో అభ్యసించి గోల్డ్ మెడల్ అందుకున్న స్టాఫ్ నర్స్, పూర్వ విద్యార్థిని కె. కల్పనకు ప్రశంస పత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. వైద్య రంగంలో నర్సుల సేవలు అసామాన్యమని కొనియాడారు. నిస్వార్థంగా అందించే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ కార్యదర్శి డాక్టర్ రమాదేవి, డీడీహెచ్ డైరెక్టర్, డీడీసీవోఎన్ ప్రిన్సిపాల్ శ్రావ్య స్పందన, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ బి. సింప్లీ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రిలో..

కోవిడ్–19 విపత్కర సమయంలో నర్సులు అందించిన సేవలు అనన్యమని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ ఎ. జయలక్ష్మి కొనియాడారు. సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవం నిర్వహించారు. దీనికి హాజరైన సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.కోవిడ్ సమయంలో రోగులకు వైద్యులు చికిత్సలు అందించిన అనంతరం, వారిని కంటికి రెప్పలా కాపాడింది స్టాఫ్ నర్సులేనన్నారు. కోవిడ్‌తో కుటుంబీకులు ఇబ్బందులు పడతారని తెలిసినా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నర్సులు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫీవర్ నర్సింగ్ విభాగం మేట్రిన్ సీహెచ్. విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో నర్సుల పాత్ర కీలకం

ముషీరాబాద్: వైద్య వృత్తిలో నర్సులు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భోలక్‌పూర్, ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి కార్పొరేటర్ సుప్రియ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి, స్టాఫ్ నర్సులు పీహెచ్ఎన్ పెల్లీస్, విజయకుమారి, సునీత, పద్మలత, సంతోషిణి, రత్నమాల, అనురాధ, శీలా, బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, కంచిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్టాఫ్‌నర్స్ కల్పనను సన్మానిస్తున్న ఉస్మానియా నర్సింగ్ ప్రిన్సిపాల్ సునీత, డాక్టర్ జీఎల్‌కే దుర్గ


నర్సులను సన్మానిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్


ఫీవర్‌ఆస్పత్రిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎస్ ఆర్ఎంవో డా. జయలక్ష్మి, నర్సులు